ఇంకెందుకు ఇల్లు?

కవికొండల వేంకటరావుగారు బి. యె; బి. యల్.

"సెనగలు అంగడిలో అమ్ముతారు. సెనగలు పొలంలో పండుతాయి. సెనగలు నీవట్టుకొచ్చేదేమిటి? నే నేకొనుక్కొని నే నేపండించుకొని ఏపకోడీలో, ఏపాళోళివో చేసికొని నీకు పెట్టకుండా తింటానుచూడు" అన్నాడు త్రివిక్రమరావు. అంటే అతనిభార్య విజయలక్ష్మి "నేను తెచ్చే సెనగలకు మీరు తెచ్చేసెనగలకు సహస్రంవారుంటుంది. వెళ్లి తెచ్చేబుద్ధి పుట్టాలినాకు. ఎంచేతో ఈ యేడు పేరంటానికి వెళ్లడమంటే బుద్ధి పుట్టడంలేదు. మీరు వండబోయ్యే పిండివంటతిని యింట్లోనే కూర్చుందామనివుంది" అంది.

ఆపొద్దు శ్రావణమంగళవారం. అంతకుపూర్వం ఎంతసేపట్నుంచి భార్యాభర్తలిద్దరూ అలాతర్కించు కుంటూ కాలంవెళ్లబుచ్చేరో ఎవరికీ తెలియదు. అప్పుడే తపాలాబంట్రోతు "ఉత్తరాలొచ్చాయండో" అని తలుపుసందంట పడేసి వెళ్లిపోయినాడు. ఆ యుత్తరాలు మూడోనాల్గో విజయలక్ష్మి తీసి తిన్నగా తెచ్చి త్రివిక్రమరావు చేత పెడుతూ "దీనికి బిళ్ల లేదేమిటండి?" అని అడిగింది. "దేనికి?" అని త్రివిక్రమరావు "తపాలాబంట్రోతు ఉత్తరాలుతీసికొనివచ్చినాడూ అంటే 2 ఘంట లపరాహ్నంతిరిగిందన్నమాటే. కాఫీకి 'స్టవ్' అంటించేవుకావింకా?" అని "దీనికా?" అని ఆమూడునాలుగుత్తరాల్లోనూ ఒక కవరు తీసి ఇటూఅటూ చూచి "బిళ్ల లేకపోవడమే కాకుండా అసలంటించికూడాలేదు. బహుశా ఊళ్లోవాళ్లెవళ్లో టీకి పిల్చివుంటారు" అన్నాడు. "మిమ్మల్నీ నన్నూ కూడానా? మిమ్మల్నేనా?" అంది విజయలక్ష్మి. "నన్నొక్కణ్ణే అయ్యుంటుంది. నిన్ను పిల్చేవాళ్లంతా నన్ను పిలుస్తున్నారా? నిన్నమధ్యాహ్నంనుంచి చూస్తా గుమ్మంఎక్కే పడుచు దిగేపడుచు నీకు బొట్టెట్టి సెనగలకు రమ్మనమనడమేగాని నన్ను పిలవడంవుందా? అలాగే నన్ను పిల్చేస్నేహితులున్నా" అన్నాడు త్రివిక్రమరావు. "ఇంతకూఅది పిలుపవునో కాదో చూడండి. వట్టినాట కప్పేవరేమో? అప్పుడే అనేసెయ్యకండి. ఆఁఏమి అకులుకు?" అంది విజయలక్ష్మి. త్రివిక్రమరావు మందహాసంతో "నేనన్నాక 'టీ' కి కాక పుట్టోఅందు కవుతుందా అది?" అన్నాడు. "అయితే 'స్టవ్' వెలిగించనక్కఱలేదు. నేను పేరంటానికి వెళ్లిపోవచ్చునన్నమాటే" అంది విజయలక్ష్మి. "అయితే యింటికి తాళం నువ్వేసుకొనివెళ్లి నాకు తాళంచెవి యివ్వడమా? లేక తాళం నేనేసుకొని వెళ్లి నీకు చెవియివ్వడమా? యోజించు" అన్నాడు త్రివిక్రమరావు. "ఎవరిముస్తాబుముందైతే వారు ముందువెళ్లి పోవడం. రెండోవారు తాళంవేసికొని తాళాలుకూడా పట్టుకుపోవడం. తాళాలుపట్టుకుపోయినవాళ్లు తిరిగి వచ్చేదాకా తాళాలు పట్టుకెళ్లనివాళ్లు కనిపెట్టుక్కూర్చోవడం" అంది విజయలక్ష్మి.

"మొగాణ్ణి నాకు ముస్తాబేమిటి" అని త్రివిక్రమరావు చెవులపోట్టి మెడచొక్కాతొడుక్కొని దాని మీద్దోఖండువావేసికొని కాళ్లకో ఆకుచెప్పుల్జోడు తగిలించుకొని చేతిబెత్తం మూలనున్నదాన్నట్టే అందుకొని రంయిని వెళ్లిపోయినాడు తనకొచ్చిన తక్కిన వుత్తరాలు చూచుకుంటూ, చేతులూచుకుంటూ.—విజయలక్ష్మి ఆనడుతూవున్న భర్తకేసిచూస్తూ "మొగవాళ్లెంతకైనా స్వేచ్ఛావిహారులు. పక్షుల్లే ఒక్కనిముసంలో ఎగిరి పోగలరు. ఆడవాళ్లు కబుర్లేగాని కాళ్లగొలుసులు, చేతుల వంకీలు త్రిప్పుకుంటేనేగాని సరుదుకుంటేనే గాని కదల్లేరు." అంటూ తలుపులోపల గెడపెట్టుకుని గదిలో పెట్లోచీర తీసికోబోతూంది. చటుక్కున వీధి తలుపెవరో గాజుల మ్రోతతో తట్టినట్టయింది. "ఎవరమ్మా?" అంది విజయలక్ష్మి. "నేనూ" అంటూ దీర్ఘంతీసింది అవతల ఎవరో. విజయలక్ష్మి సరభసంగా వీధితలుపుతీసి "ఓసి! నోసి! నువ్వాటే? ఎవరోఅనుకున్నాను. శ్రావణ మాసం సెనగలకు పిలవడానికేనావచ్చేవు? వస్తున్నా. నీవెనకాలే వస్తున్నా" అంది.

551

విజయలక్ష్మి హడావిడిచూచి గోపి మరేంమాటాడలే. ఆవిడంతహడావిడిగా వస్తున్నావనకపోతే అనుండేది "నిన్నరాలేక పోయాను. అన్నిళ్లూపిల్చుకుని దగ్గఱేల్లుగదా మీయిల్లు ఎప్పుడు పిల్చినా పిలవొచ్చు నను కోవడంలో రాత్రి ఎనిమిది తొమ్మిదై పోయింది—" అనిఏమేమో గోపి అనుండేది. కాని విజయలక్ష్మి హడావిడిచూచి గోపి మరేంమాటాడలే. వెళ్లిపోయింది.

గోపి మరేంమాటాడకపోయినా గోపిని గురించి ఓమాటమనం అనుకోవలసివుంది. "గోపి" అని ఆ అమ్మాయి నెవరినో విజయలక్ష్మి పిలిచిందికదా అని మనంఅంతా "గోపీ!" అని పిలువకూడదు. ఈపైని చదువకూడదు. ఆ అమ్మాయిపేరు గోపెమ్మ. పదారేళ్లుంటాయి. కాని ఆ అమ్మాయికి తల్లిదండ్రులు శారదా శాసనాన్ని అనుసరించి పెళ్లిచేయడంవల్ల ఆయేడే కొత్తగా శ్రావణమంగళవారాల్నోము పట్టింది. పిలుస్తాం దండన్నీ పేరంటానికని—ఎవరూ ఏమీ ఆశ్చర్య పోవడానికేముంది అందులో. ఆపిల్లా అందరిలాగే పిలుచుకుని వెళ్లింది ఇంటింటా. కాని ఇంటింటా అమ్మలక్కలు మాత్రంగుసగుస లాడుకోవడంమానలే. "శారదాశాసనంక్రింద పెళ్లిచేసికొన్నా సెనగలవాయనం శ్రావణశుక్రవారాల్నోములూ ఎప్పట్లాగే చేసికోవచ్చును. వాటికి నిషేధంలేదుగా" అని ఒకముత్తయిదు అంటే "శారదాశాసనం క్రింద పెళ్లిచేసుకుంటే బిడ్డలుట్టరా? వాళ్లకు సంసారంవుండదా!" అని మరోముత్తయిదు—

విజయలక్ష్మికి పైమాదిరిగా వితర్కింపులోపడ్డానికి అవకాశంలేకపోయింది. పిల్చింది తడవుగా పేరంటానికి వెళ్లిపోవడానికి కాలంకటాకటీగావుంది. గబుక్కున ముస్తాబుఅయి తలుపు తాళంవేసికొని తాళంచెవి చెంగునకట్టుకొని శింగురంగామని రాజమార్గాన్నే పేరంటానికి బయలుదేరుతూ "ఆలస్యంగాపిల్చిన వాళ్లింటికి ఆలస్యంగానే వెళ్లాలా? ఆలస్యంగాపిల్చినా దగ్గఱేల్లు అని ముందుగా వెళ్లాలా?" అని ఒకచూపుమాత్రంగా ఆలోచించి తన భర్త త్రివిక్రమరావు వెళ్లిన దిక్కు అదే, అటేగోపెమ్మ గారియిల్లూను, పోనీ గోపెమ్మగారియింటికే వెళదాము అని చెప్పశక్యముగాని ఒకానొకతాత్కాలికకారణంప్రేరేచగా విజయలక్ష్మి తుట్టతుదకేలా అయితేం గోపెమ్మ గారింటికే మొట్టమొదట పేరంటం చెయ్యడానికి నిశ్చయించుకుంది. నిశ్చయించుకొని గోపెమ్మగారింటికి వెళ్లింది.

లోపలిచావడిలో చాపలు పరిచినారు. ఆచాపలమీద వచ్చేపేరంటాండ్రను కూర్చోబెట్టి గోపెమ్మ తల్లి సెనగలుఇస్తూ పంపిస్తూంది. ఆచావడి కోప్రక్కగా ఒకగదివుంది. ఆగదిలో మగవాళ్లు ఇష్టాగోష్టిగా కాలక్షేపంచేస్తూవున్నట్టు సూచనగా చావడిలోనికి వినబడుతుండేగాని కనబడదు. ఏమాఅంటే గదితలుపు ఈవలమూసి గదిఆవలి గుమ్మంవీధి చావడిలోనికి ఆదిపే జారగా తెరచి వుంచినారు. వీధంట వచ్చేఆడవాళ్లు లోపలి మగవాళ్లకు కనబడేటట్టు, లోపలిమగవాళ్లుమాత్రం ఎవరికీ కనబడనట్లు. —

విజయలక్ష్మి కాసేపు కూర్చోవడంలో గదిలో మగవాళ్ల ఇష్టాగోష్టినడుమ తన భర్త కిచకిచమనినవ్వుతూండడంవింది. "ఎవరైనా ఉన్నారా ఏమిటి అక్కడ?" అని అంది విజయలక్ష్మి గోపెమ్మను కొంచెం దగ్గఱగా పిలిచి. గోపెమ్మ "మీఆయనా మాఆయనా. అంతే. ఇంకెవరూకారు" అంది. "అయితే త్వరగా పోవాలమ్మా! గోపెమ్మా!" అంది విజయలక్ష్మి.

ఆమాటవింటూ "ఇంటితాళం ఇలాఇచ్చి మరీవెళ్లు. ఎన్నిఇళ్లునీవు తిరిగిరావాలో ఇంకా?" అన్నాడు త్రివిక్రమరావు. "ఎక్కడికో 'టీ' కివెడతానన్నారుగా!" అంది విజయలక్ష్మి. "ఇక్కడికే" అని తలుపు బార్లా తీసివేసినాడు త్రివిక్రమరావు.

గదిలో మేజాబల్ల. మేజాబల్లమీద తెల్లనిగుడ్డ. తెల్లనిగుడ్డమీద పళ్లాలు, కూజాలు, కిన్నెలు, గరిటెలు; వాటిల్లోపళ్లు, రొట్టెలు, పకోడీలు, తియ్యబూంది, కారాబూంది ఒకటేమిటి అన్నీవున్నాయి.

త్రివిక్రమరావు ఆడిగేడు విజయలక్ష్మిని వెంటనే "చూడు మగవాళ్లకు శ్రావణమంగళవారపు వాయనం ఏలావుందో?" అని ఒక పకోడీతనపోట్లో వేసికొన్నాడు. గోపెమ్మ "అలాంటప్పుడు మాకు కూడదు. నీవు కూడ కూర్చునితినాలిసిందే. చూడు నేనెలాకూర్చునితింటానో" అని తన భర్త దగ్గఱనగా కూర్చుంటూ విజయలక్ష్మినిలాగింది.

విజయలక్ష్మి జంకక కూర్చుంటూ "నన్ను కూడా తేసీటికే పిలువక పెనగలవాయినానికని ఎందుకు పిల్చేవు?" అంది. "ఆపిలుపు మాఅయంది. ఈపిలుపు వాడి" అంది గోపెమ్మ. "అలా అనకు" అంది విజయలక్ష్మి. "వాడి శ్రావణమంగళవారప్పిలుపు. మీఅయంది సంఘసంస్కరణప్పిలుపు అని అను" అంది. త్రివిక్రమరావు అన్నాడు "రెండూమిళితమై యున్నాయి ఈపకోడీల్లో. ఏమమ్మా! గోపెమ్మా! ఆవానబోసిన పెనగలు రుబ్బి చేసినవేగా ఈపకోడీలు? గోపెమ్మ "ఏమో చిన్నపిల్లను నాకవన్నీ తెలియవు, తినడమేగాని" అంది: అని ఒక పకోడీతనసోటిలో వేసికొంది. గోపెమ్మ పెనిమిటి "తెలియదనకుమతీ. పంద్రెండేళ్లప్పటి పెళ్లిపడుచులు వాయనమిస్తే పెనగలువాయనమియ్యాలి. పదారేళ్లప్పుడు పెళ్లిఅయియుంటే టీపార్టీ చెయ్యాలి అని అనలే నిన్నను నీవు?" అని అంటూ గిన్నెలోనికి తేసీటికపాయంపోసినాడు గోపెమ్మచాలుచాల సేలాగు. చావడిలోనుంచి సర్వసామాన్యపుపేరంటాండ్రంతా గోపెమ్మతల్లి వాయినాలిస్తుంటే పుచ్చుకుంటూ ఊతొంగి చూడ్డం, విజయలక్ష్మమ్మకూడ వాళ్లల్లో కలిసి పోయిందనుకోవడం, విజయలక్ష్మి త్రివిక్రమరావు కేసి చూస్తూ తన చెంగుతాళంచెవి కావలిసొస్తే విప్పుకోమనడం......

త్రివిక్రమరావు "ఇంటికిరావు నీవు?" అన్నాడు. భార్యకేసిచూస్తూ విజయలక్ష్మి "ఇంకెందుకు ఇల్లు? పెనగలు నేనింటికి పట్టుకుని వెళ్లి వేయించనక్కఱలేదు. ఒలువనక్కఱలేదు. రుబ్బనక్కఱలేదు. మీకుపెట్టనక్కఱలేదు. నేతినక్కఱలేదు. ఇంకెందుకు ఇల్లు?" అంది. పకపకానవ్వుకున్నారు అంతా.

పావనంబైనమాసంబు శ్రావణంబు

కొమ్మూరి భోగలింగాచార్యగారు

దేశాలవెంబడిఁ దిరుగాడుజనముల
  మనములమరలించు మాయకత్తె
ప్రకృతిసౌందర్యంబు పరికించువారల
  మోదంబునందేల్చు ముద్దరాలు
పచ్చపైరులపైని పర్వెత్తుగాలుల
  రమణీయకతఁజూపురాణిగారు
ప్రతిదినంబునుకష్టపడిజీవనముసేయు
  హాళికాళికిఁదగు నాటవిడుపు
నూతనప్రేయసీదర్శనాతురులగు
  క్రొత్తయల్లుండ్రపాలిటి కులుకులాడి
కామినులశుక్రవారంపునోములొసఁగు
  పావనంబైనమాసంబు శ్రావణంబు.

వాయనమ్ములకేతెంచు వనితలరుగో!

శ్రీమతి కోట సుబ్బులమ్మగారు

చిఱివేరుసింగారజల్లుచీరెలతోడ
  నవయువమ్ములుచాల వందగింప;
కోరికబఱగించి నోరచూపులఁజూచు
  వారినెమ్మది మదులూరఁజేయ;
కమనీయతరకరకమలమందు శనగ
  మూట లనుపమమై ముదముగూర్ప;
గమనవేగంబునఁ గడుసుందరంబైన
  కాళ్లయందెలు ఘులుఘల్లురనగ;
నసుముదూగాడ నొయ్యారినడకతోడ
సఖులుగొనియాడ వదినెలు సరసమాడ
జిఱునగవుమోములందున జిందులాడ
వాయనమ్ములకేతెంచు వనితలరుగో!